ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

సోమవారం 16 సెప్టెంబరు 2024

పాలకొండ డీఎస్పీగా రాంబాబు



పాలకొండ: పాలకొండ డీఎస్పీగా ఎం.రాంబాబు నియామకమయ్యారు. శ్రీకాకుళంలో ఇంటిలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. గతంలో గుమ్మలక్ష్మీపురం, పాలకొండ ప్రాంతాల్లో వివిధ హోదాల్లో రాంబాబు పనిచేశారు. ఈ నెల 17న ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు.

పరిశ్రమలతోనే ప్రగతి

- 'మన్యం'లో సహజ వనరులెన్నో..
- పారిశ్రామికీకరణకు అడుగులు పడని వైనం
- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. మూతపడిన పరిశ్రమలు
- ఉపాధి లేక వలసబాట పడుతున్న జిల్లావాసులు
- కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని విన్నపం



ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం ఇలా..

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

ఏ ప్రాంతంలోనైనా పారిశ్రామిక అభివృద్ధి చాలా ముఖ్యం. అప్పుడే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. కానీ జిల్లాలో ఆ పరిస్థితి లేదు. పారిశ్రామికీకరణకు ఎన్నో వనరులు ఉన్నా.. ఆ దిశగా అడుగులు పడడం లేదు. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త పరిశ్రమలు రాకపోగా.. ఉన్నవి మూతపడ్డాయి. ఫలితంగా ఏటా ఎంతోమంది జిల్లావాసులు వలసబాట పడుతున్నారు. పొట్ట చేతపట్టుకుని ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు పయనమవుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జిల్లాలో పారిశ్రామికీకరణపై దృష్టి సారించాల్సి ఉంది. వలసలను నివారించాల్సి ఉంది.



సాలూరులో లారీలు

ఇదీ పరిస్థితి..

జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పాటైన పార్వతీపురం మన్యంలో చెప్పుకోదగ్గ పరిశ్రమలేవీ లేవు. వాస్తవంగా అభివృద్ధిలో వెనుకబడిన ఈ ప్రాంతంలో పేదలే ఎక్కువ. వారిలో అత్యధికులకు వ్యవసాయమే ఆధారం. మరోవైపు ఏజెన్సీలో గిరిజనులు పోడు సాగుతో పాటు అటవీ ఉత్పత్తులు సేకరిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఏటా సంభవించే ప్రకృతి వైపరీత్యాల సమయంలో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయం చేయలేక.. వేరే పనుల్లోకి వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలో పరిశ్రమలు లేకపోవడంతో పనుల కోసం కుటుంబాలతో వేరే ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ వంటి కర్మాగారాలు రాకపోయినా.. కనీసం వెయ్యి మంది వరకూ ఉపాధి పొందే చిన్న, మధ్య తరహా కర్మాగారాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- సీతానగరం మండలం లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం, సాలూరు నియోజకవర్గంలోని జీగిరాం జూట్ మిల్లు ఇప్పటికే మూతపడ్డాయి. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమంది ఉపాధి కోల్పోయారు. అయినప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఎన్‌సీఎస్ ఫ్యాక్టరీకి చెందిన భూములను రియల్ ఎస్టేట్లుగా మార్చారే తప్ప చక్కెర కర్మాగారాన్ని పునఃప్రారంభించేందుకు ఏ మాత్రం శ్రద్ధ వహించలేదు.
- గతంలో సాలూరు మండలంలో కరాసవలసలో సిమెంట్ పరిశ్రమ ఉండేది. అయితే వివిధ కారణాలతో అది మూతపడింది.
- జిల్లాలో అటవీ ఉత్పత్తులకు కొదవ లేదు. అయితే గిట్టుబాటు ధర లేక గిరిజనులు నష్టపోతున్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో జీడి పంట అధికంగా ఉన్నప్పటికీ జీడి ప్రాసెసింగ్ యూనిట్లు లేవు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో యూనిట్లను ఏర్పాటు చేయడంతో పాటు అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



మూతపడిన జీగిరాం జూట్ మిల్లు

- రాష్ట్రంలో విజయవాడ తరువాత సాలూరు లారీ పరిశ్రమలో రెండో స్థానంలో ఉంది. పట్టణంలో 2,400 పైగా లారీలున్నాయి. ప్రత్యక్ష, పరోక్షంగా 26 వేల మంది వరకు లారీ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి పరిస్థితి దయనీయంగా మారింది. వ్యాట్, రోడ్డు ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్, డీజిల్‌పై వ్యాట్, రోడ్ సెస్ ఇలా పలు పన్నులను వైసీపీ ప్రభుత్వం పెంచింది. ఈ భారంతో లారీలను నడపడానికి యాజమానులు ముందుకు రాకపోవడంతో ఆ ప్రభావం కార్మికులపై పడింది. మొత్తంగా సాలూరు లారీ పరిశ్రమపై వైసీపీ శీతకన్ను వేసింది. కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. అయితే దీనికి సంబంధించి స్పేర్ పార్ట్స్‌తో పాటు టైర్లు తయారీ తదితర పరిశ్రమలను ఏర్పాటు చేస్తే.. కార్మికులతో పాటు మరెంతో మంది ఉపాధి పొందే అవకాశం ఉంది. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి 'మన్యం'లో పారిశ్రామికీకరణకు చర్యలు తీసుకోవాలని, మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు చొరవ చూపాలని జిల్లావాసులు కోరుతున్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు నూతన పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ-క్రాప్ గడువు పెంపు

గరుగుబిల్లి, సెప్టెంబరు 15 : జిల్లా పరిధిలో ఈ-క్రాప్ నమోదు గడువును ఉన్నతాధికారులు పెంచారు. వాస్తవంగా 15 మండలాల్లో ఈ నెల 15 నాటికి ఈ-క్రాప్ పూర్తి చేయాల్సి ఉంది. అయితే నిర్దేశించిన లక్ష్యాల మేరకు నమోదు కాకపోవడంతో మరో 15 రోజులు సమయం పెంచారు. ఈ నెల 30లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుత ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటల వివరాలను సమీప రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బందికి అందించాల్సి ఉంది. సాగు చేస్తున్న భూమి సర్వే నెంబరు, విస్తీర్ణం, పంట రకం, పాస్ పుస్తకం, ఆధార్‌తో పాటు ఫోన్ నెంబరు అందించాలి. సంబంధిత సిబ్బంది సాగు చేస్తున్న పంటను జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంది. ఈ-క్రాప్ నమోదు తదుపరి సమాచారం రైతులకు చెందిన సెల్ ఫోన్లకు చేరుతుంది. ఈ-క్రాప్ నమోదులో పలు ప్రోత్సాహకాలు, రాయితీలు పొందొచ్చు. తుఫాన్ సమయంలో పంటలకు నష్టాలు కలిగితే తగిన పరిహారం పొందొచ్చు. జిల్లాలో 2.66 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 94 శాతం మేర ఈ-క్రాప్ , ఈకేవైసీ 60 శాతం మేర పూర్తయింది. ఈ నెల 30లోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేస్తామని ఏవోఆర్.విజయభారతి తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయాలకు మోక్షం

- ఉమ్మడి జిల్లాలో 13 భవనాల నిర్మాణాలకు చర్యలు

గరుగుబిల్లి, సెప్టెంబరు 15 : ఉమ్మడి జిల్లా పరిధిలో శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ కార్యాలయాలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. మొత్తంగా 13 నూతన భవనాలు మంజూరు చేస్తూ జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీడీవోలకు సమాచారం అందించారు. మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి, పార్వతీపురం, సీతానగరం, మక్కువ, విజయనగరం జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ, గుర్ల, మొరకముడిదాం, గంట్యాడ, తెర్లాం, జామి, వంగర మండలాలకు భవనాలు మంజూరు చేశారు. ఈ మేరకు కార్యాలయ భవనాల ప్రస్తుత పరిస్థితి తెలిపే ఫొటోలు, నిర్మాణ ప్రణాళికలు, ఫౌండ్ నెస్ సర్టిఫికేట్, నిధులు లభ్యతలు, నిల్వ వివరాలు, అంచనా విలువల ప్రతిపాదనలు, మండల ప్రజాపరిషత్ తీర్మానంతో పాటు తదితర సమాచారాన్ని త్వరితగతిన అందించాలని ఎంపీడీవోలకు ఆదేశాలు అందాయి.



శిథిలావస్థలో ఉన్న గరుగుబిల్లి ఎంపీడీవో కార్యాలయం

మెనూ అమలు ఇలాగేనా?

- చాలీచాలని కూరలు పెట్టి.. మమ అనిపిస్తున్న సిబ్బంది
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- కేజీబీవీలో విద్యార్థినులకు తప్పని ఇబ్బందులు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 15: సీతంపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. చాలీ చాలని కూరలు పెడుతూ.. చేతులు దులుపుకుంటున్నారు. దీంతో విద్యార్థినులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందడం లేదు. అర్ధాకలితోనే వారు విద్యనభ్యసించాల్సి వస్తోంది. వాస్తవంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కేజీబీవీలో చదువుతున్న బాలికలకు ప్రత్యేకంగా భోజన సౌకర్యం కల్పించాల్సి ఉంది. అయితే మెనూ అమలులో పాఠశాల సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సీతంపేట కేజీబీవీలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తంగా 272 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వారికి ప్రతి ఆదివారం ప్రత్యేక మెనూతో భోజనం పెట్టాల్సి ఉంది. బగారన్నంతో పాటు ఒక్కొక్కరికీ 100 గ్రాములు చికెన్, టమాటా రసం, చిక్కని మజ్జిగ ఇవ్వాలి. శాఖాహారులంటే బగారన్నం, గోంగూర కూర లేకుంటే చట్నీ, బంగాళాదుంప కూర్మా పెట్టాలి. కాని ఇక్కడ మాత్రం అవేవీ అమలు కావడం లేదు. చాలీచాలని కూరలతో భోజనం పెట్టి మమ అని పిస్తున్నారు. కాగా ఈ ఆదివారం కేజీబీవీలో విద్యార్థినులకు కేవలం రెండు అంటే రెండు చికెన్ ముక్కలు వేశారు. చిక్కని మజ్జిగను పూర్తిగా విస్మరించారు. శాఖాహారులైన పిల్లలకు బంగాళాదుంప కూర మాత్రమే పెట్టారు. అసలు కేజీబీవీ విద్యార్థినుల కోసం సుమారు 20 కేజీల చికెన్ వండాలి. కానీ పది కేజీల చికెన్, 5 కేజీల బంగాళ దుంపలు కలిపి వండుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమే ఈ పరిస్థితికి కారణమనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీనిపై కేజీబీవి ప్రిన్సిపాల్ రూపను వివరణ కోరగా.. కేజీబీవీలో విద్యార్థినులకు మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని సమాధానమిచ్చారు. 'ఈ ఒక్కసారికి ఇలా జరిగింది... మెనూ అమలులో మరోసారి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటాం' అని అకౌంటెంట్, వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాత చెప్పడం గమనార్హం.



విద్యార్థిని ప్లేటులో రెండు చికెన్ ముక్కలు వేసిన దృశ్యం

అంతిమ సంస్కారాలకు అవస్థలు

- కాజ్‌వేపై వరద నీటిలో వెళ్లాల్సిన పరిస్థితి..

సాలూరు రూరల్, సెప్టెంబరు 15: శివరాంపురం వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో గ్రామస్థులకు తిప్పలు తప్పడం లేదు. చివరకు అంతిమ సంస్కారాలకు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆదివారం ఆ గ్రామంలో కనకల అప్పలనర్సమ్మ (64) మృతి చెందింది. అయితే అంత్యక్రియల కోసం శ్మశానానికి బయల్దేరిన కుటుంబ సభ్యులు, బంధువులు నానా అవస్థలు పడ్డారు. మార్గమధ్యంలో ఉన్న కాజ్‌వేపై నాచు, వరద ఎక్కువగా ఉండడంతో మోకాళ్ల లోతు నీటిలో పాడెను మోసుకుంటూ అతి కష్టం మీద నదిని దాటారు. ఏటా వర్షాకాలంలో తమకీ ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపో తున్నారు. వాస్తవంగా వంతెన నిర్మాణానికి 2007లో రూ. 3 కోట్లు మంజూరవగా.. రూ.కోటితో స్తంభాలు నిర్మించి వదిలేశారు. గత ప్రభుత్వం రూ. 5.95 కోట్లు మంజూరు చేసినా టెండర్లు పిలవ లేదు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.



కాజ్‌వేపై వరద దాటుకుని శ్మశానానికి వెళ్తున్న దృశ్యం

19న ఉచిత ఇసుక పోర్టల్



పార్వతీపురం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక సరఫరా కోసం ఈనెల 19న పోర్టల్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు గనుల భూగర్భ శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ .. జిల్లా అధికారులంతా.. ముందుగా విధి విధానాలను పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలన్నారు. ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తుండగా, తవ్వకం, రవాణా ఖర్చులను మాత్రమే వసూలు చేయనున్నట్లు తెలిపారు. వాహ నాలు ఫిట్‌నెస్ కలిగి ఉండాలని, జీపీఎస్ పరికరం, టార్పాలిన్ ఉండాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిల్లా గనుల భూగర్భ శాఖ అధికారి కె.శ్రీనివాసరావు, రవాణాశాఖ అధికారి ఎం.శశికుమార్ తదితరులున్నారు.

బెధరగొడుతున్నాయ్

- పెరిగిన వంట నూనెల ధరలు
- బెంబేలెత్తిపోతున్న వినియోగదారులు



పార్వతీపురం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : వంట నూనెలపై కేంద్రం దిగుమతి సుంకం పెంచడంతో వాటి ధరలు అమాంతం పెరిగాయి. దీంతో 15 కిలోల డబ్బా ధర శుక్రవారం వరకు రూ.1730 ఉండగా, శని వారానికి రూ.1950, ఆదివారానికి రూ.2 వేలు దాటింది. కిలో ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.125కు పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కిలో ఆయిల్ ప్యాకెట్‌కు అదనంగా రూ.5 పెంచి విక్రయిస్తున్నారు. దీంతో విని యోగ దారులు బెంబేలెత్తిపోతున్నారు. వంట నూనెల ధరల పెంపుపై జిల్లా వాసులు మండిపడుతున్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సతమతమవుతున్న తమపై ఈ భారం మోపడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. వంటింటి బడ్జెట్ ఒక్కసారిగా పెరిగిందని సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారు, హోటల్ నిర్వాహకులు వాపోతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని వారు కోరుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులు

- ప్రత్యేక పోడియం రద్దు
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



పార్వతీపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పార్వతీపురం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బ్రిటిష్ కాలం నాటి పద్ధతులను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉండే ప్రత్యేక పోడి యాన్ని రద్దు చేస్తూ.. ప్రజలను గౌర వించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇతర ప్రభుత్వ కార్యాలయాల మాదిరిగానే ఒకే ఫ్లోర్ కింద వాటిని తెచ్చేందుకు చర్యలు తీసుకోనున్నారు. అదేవిధంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన వారికి కుర్చీలు, తాగునీటితో పాటు అకాశం ఉంటే టీ, కాఫీ సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సబ్‌రిజిస్ట్రార్ కుర్చీని కూడా ఎత్తులో కాకుండా సాధారణ ఫ్లోరింగ్ ఎత్తులోనే ఉండాలని సూచిం చింది. రిజిస్ట్రేషన్‌కి వచ్చిన ప్రజలు కూర్చుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేయాలని, సబ్ రిజిస్ట్రార్‌కి ప్రజలకు మధ్య టేబుల్ తప్ప మరేమీ అడ్డంగా ఉండకూడదని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆదేశించారు. కాగా జిల్లాలో పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటిల్లో ప్రత్యేక పోడియాన్ని తొలగించి.. ఒకే ఫ్లోర్‌లో కార్యాలయం ఉండేలా ఏర్పాట్లు చేయనున్నారు.

మళ్లీ పాత స్టాంపుల విక్రయాలు..

ఆస్తుల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, ఒప్పందాలు, అఫిడవిట్‌లకు వినియోగించే పాత స్టాంపు పేపర్లు మళ్లీ అందుబాటులోకి రానున్నాయి. వైసీపీ పాలనలో వాటి స్థానంలో ఈ-స్టాంపులను ప్రవేశపెట్టారు. దీంతో క్రయ, విక్రయదారుల నుంచి అభ్యంతరాలు వచ్చినా వాటిని గత ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. గతంలో నాసిక్‌లో తయారయ్యే జ్యుడీషియల్ స్టాంపులను రిజిస్ట్రేషన్, అఫిడ్‌విట్ ఒప్పందాలు, తదితర కార్యకలాపాలకు వినియోగించేవారు. రూ.20, రూ.50 , రూ.100 స్టాంపులు సుదీర్ఘకాలంగా మన్నికగా ఉండేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వం వీటిని కొనుగోలు చేయలేక నాసిక్ క్యాంపుల విక్రయాన్ని నిలిపివేసింది. ఈ-స్టాంపు పేరుతో నాసిరకం పత్రాలు అందుబాటులోకి తెచ్చింది. అయితే కొద్దిరోజులకే ఈ పత్రాలు చిరిగిపోతు న్నాయంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. మరోవైపు వీటిపై సబ్ రిజిస్ట్రార్లు సమాధానం చెప్పలేక తలలు పట్టుకునేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణల పేరిట పాత విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

నేటి నుంచి వందేభారత్

- విశాఖ నుంచి దుర్గ్ వరకు నడవనున్న రైలు
- పార్వతీపురంలో హాల్ట్



పార్వతీపురం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి దుర్గ్ వరకు నడవనున్న వందేభారత్ రైలు సోమవారం లాంచనంగా ప్రారంభం కానుంది. ప్రధాన మంత్రి మోదీ నేడు వర్చువల్‌గా దీనిని ప్రారంభించనున్నారు. అయితే తొలిరోజు ఇది రాయగడ వరకు మాత్రమే నడుస్తుంది. 20వ తేదీ నుంచి రెగ్యులర్‌గా రాకపోకలు కొనసాగుతాయి. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గురువారం మినహా ప్రతిరోజూ నడుస్తుంది. ఇందులో 16 బోగీలు, అందులో 14 చైర్ కార్, రెండు ఎగ్జికూటివ్ బోగీలు ఉంటాయి. ఈ రైలుకు పార్వతీ పురంలో హాల్ట్ ఇవ్వడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా దుర్గ్‌లో ఉదయం 5.45 గంటలకు ఈ రైలు బయలు దేరుతుంది. రాయ్‌పూర్, కరియార్ రోడ్డు, కంటాబంజి, టిట్లాగఢ్, కేసింగ, రాయగడ , పార్వతీపురం, విజయనగరం మీదుగా విశాఖ చేరుకుంటుంది. పార్వతీపురంలో ఉదయం 11.30 నిమిషాలకు వచ్చి 11.32 నిమిషాల వరకు ఆగుతుంది. తిరుగు పయనంలో విశాఖలో మధ్యాహ్నం 2.50 గంటలకు బయలుదేరి పార్వతీపురంలో సాయంత్రం 4.36 గంటలకు వచ్చి 4.38 నిమిషాల వరకు ఆగుతుంది. రాత్రి 10.30 గంటలకు అది దుర్గ్ చేరుకుంటుంది.

ఫలించిన ఎమ్మెల్యే కృషి

వాస్తవంగా వందేభారత్ ట్రైల్ రన్ నిర్వహించిన సమయంలో పార్వతీపురం, టౌన్ రైల్వే స్టేషన్‌లో రైలును నిలుపలేదు. దీనిపై స్పందించిన పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర విశాఖలోని డీఆర్‌ఎం , రైల్వేశాఖ సహాయ మంత్రిని ఢిల్లీలో కలిసి సమస్యను వివరించారు. పార్వతీపురానికి హాల్ట్ ఇవ్వాలని కోరారు. దీనిపై రైల్వేశాఖ సహాయ మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. మొత్తంగా ఎమ్మెల్యే కృషి ఫలించడంతో కూటమి శ్రేణులు, ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది

పార్వతీపురంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నిలిపే విధంగా రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న చర్యలు తీసుకోవడం ఆనం దంగా ఉంది. రైల్వేశాఖ ఉన్నతాధికారులు కూడా సహకరిం చారు. పార్వతీపురంలో వందేభారత్ హాల్ట్ కోసం చేసిన ప్రయత్నం విజయవంతమవడం సంతోషంగా ఉంది.

- బోనెల విజయచంద్ర, ఎమ్మెల్యే, పార్వతీపురం

స్వాగత ఏర్పాట్లు చేస్తున్నాం..

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నేటి నుంచి ప్రారంభం కానుంది. మొదట విడుదల చేసిన షెడ్యూల్‌లో పార్వతీపురంలో స్టాప్ లేదు. ఆ తర్వాత స్టాప్ ఉన్నట్టు ఆదేశాలు వచ్చాయి. ఇందు కోసం ప్రయత్నించిన ఎమ్మెల్యే విజయచంద్రకు అభినందనలు. పార్వతీపురం వస్తున్న ట్రైన్‌కు స్వాగత ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

- శ్రీనివాసరావు, స్టేషన్ మాస్టర్, బెలగాం రైల్వేస్టేషన్, పార్వతీపురం

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం



లెటర్ రిపీటెడ్ సిరీస్

రీజనింగ్

వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు:

1. **abc/bca/cab/abc.**
మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
2. **aaa/bbb/ccc/aaa**
ప్రతి సమూహంలో ఒక అక్షరమే మూడుసార్లు ఉన్నది.
3. **acac/abab/acac/abab**
acac/abab అనే అక్షరాల సమూహాలు రెండుసార్లు రిపీట్ అయ్యాయి.
4. **ab/aab/aaab/aaaab**
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతోపాటు ఒక 'a' అదనంగా చేరుతున్నది.
5. **abca/abcb/abcc/abca**
ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా abcలే రిపీట్ అయ్యాయి. మొదటి సమూహంలో చివరి అక్షరంగా a, రెండో సమూహంలో చివరి అక్షరంగా b, మూడో సమూహంలో చివరి అక్షరంగా c ఉన్నది. ఈ విధంగా కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
6. **abcd/bcda/cdab/dabc/adcb.**
మొదటి సమూహంలో చివరి మూడు అక్షరాలు రెండో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, మొదటి సమూహంలో ఒకటో అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
7. **PQQ/QRR/RPP/PQQ**
ప్రతి సమూహంలో చివరి రెండు అక్షరాలు ఒకటే.
8. **aab/bbc/cca/aab**
ప్రతి సమూహంలో మొదటి రెండు అక్షరాలు ఒకటే.
9. **ab/abb/abbb/abbbb**
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'b' అదనంగా చేరుతున్నది.

ప్రతి సమూహంలో ఒకే విధమైన అక్షరాలు రిపీట్ అవుతున్నాయి. ఇలాంటి సందర్భాలలో ప్రశ్నలకు సమాధానం రాబట్టడానికి కింద తెలిపిన విధానాన్ని అనుసరించవచ్చు.

ఉదా: P - R - Q - P Q - - Q R

ఎ) QPRPR బి) QPRRP

సి) QRPQP డి) ఏదీకాదు

పై ఉదాహరణలో అక్షరాలు, ఖాళీలు మొత్తం 12 ఉన్నాయి. 12 ఉంటే 3 లేదా 4 స్థానాలను ఒక సమూహంగా విభజించాలని తెలియపరచడం జరిగింది గమనించండి.

ముందుగా తక్కువ స్థానాలుగా అంటే 3 స్థానాలుగా విభజించాలి. సరిచూసిన తదుపరి కచ్చితమైన సమాధానం రావడానికి అవకాశం లేనప్పుడు ఎక్కువ స్థానాలుగా అంటే 4 స్థానాలుగా విభజించుకోవాలి.

మొదట మూడేసి అక్షరాలను ఒక్కొక్క సమూహంగా విభజిస్తే P - R / - Q - / PQ - / - QR.

విభజించిన తరవాత గమనించిన మొదటి, మూడో సమూహంలో మొదటి అక్షరం P ఉన్నది. అందువల్ల రెండు, నాలుగు సమూహంలో మొదటి అక్షరం 'P' అవుతుంది. ఇప్పుడు రెండు, నాలుగు సమూహాల్లో మొదటి అక్షరంగా 'P' ఉంచినప్పుడు పై అక్షర క్రమం (లెటర్) కింది విధంగా ఏర్పడుతుంది.

P - R / <u>P</u>Q - / PQ - / <u>P</u>QR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే రెండు, మూడు, నాలుగు సమూహాల్లో రెండో అక్షరంగా 'Q' ఉన్నది. కాబట్టి మొదటి సమూహంలో కూడా రెండో అక్షరం 'Q' అవుతుంది. ఇప్పుడు మొదటి సమూహంలో 'Q'ను ఉంచితే పై అక్షర క్రమం(లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

P<u>QR</u> /<u>P</u>Q - / PQ - / <u>P</u>QR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే మొదటి, నాలుగు అక్షర సమూహంలో మూడో అక్షరంగా R ఉన్నది. అందువల్ల రెండు, మూడో సమూహంలో కూడా మూడో అక్షరం R అవుతుంది. ఇప్పుడు రెండు, మూడో సమూహంలో మూడో అక్షరంగా R ఉంచితే పై అక్షర క్రమం (లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

P<u>QR</u> / <u>PQR</u> / PQ<u>R</u> /<u>P</u>QR

ఇప్పుడు అక్షర క్రమం పూర్తి అయింది. పైన ఖాళీలలో గల అక్షరాలు QPRRP ఇది సమాధానం అవుతుంది. ఆప్షన్స్‌లో QPRRP అనేది (బి)లో ఉన్నది. సమాధానం (బి) అవుతుంది.

మిగిలిన 6 నుంచి 18 వరకు ఉన్న పద్ధతుల్లో ఐచ్ఛికాల్లో ఇచ్చిన అక్షరాలను ఖాళీల్లో పెట్టుకొని జాగ్రత్తగా పరిశీలించి సమాధానాన్ని కనుగొనాలి. కాబట్టి ఇచ్చిన వివిధ రకాలైన సిరీస్ పద్ధతులను వీలైనన్ని ఎక్కువసార్లు గమనించి దాని కింద ఇచ్చిన వివరణల ఆధారంగా అవి ఏర్పడే విధానాలను అవగాహన చేసుకొని ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు సమర్థవంతంగా సమాధానాలు గుర్తించండి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి
DIKSUCHI

భారత్ అనే పేరును రాజ్యాంగంలో చేర్చాలని 1949 సెప్టెంబరు 18న నిర్వహించిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో కొందరు సభ్యులు కోరారు. 74 సంవత్సరాలు గడిచిన తరవాత కూడా ఆ చర్చ కొనసాగుతూనే ఉంది. 2023లో భారతదేశంలో కీలకమైన జీ-20 శిఖరాగ్ర సమావేశాల ప్రారంభ సన్నాహాల సందర్భంగా జరిగిన సంఘటనలు/ చర్చలతో ఈ డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



ఇండియా వర్సెస్ భారత్
ఒక దేశం రెండు పేర్లు

అయితే ఈసారి చర్చను పరిష్కరించే అంబేద్కర్ లేరు. 2023 సెప్టెంబరులో జీ-20 సమావేశాల సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ-20 అతిథులకు పంపిన అధికారిక విందు ఆహ్వానంలో 'ద ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'కు బదులు 'ద ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ముద్రించారు. సమావేశాలు నిర్వహించిన ప్రదేశానికి 'భారత మండపం' అని పేరు పెట్టారు. సమావేశాల్లో ప్రధాని ముందున్న నేమ్‌ప్లేట్‌పై భారత్ అని పేర్కొన్నారు. దీంతో 2023 సెప్టెంబరు 18న ప్రారంభమైన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఇండియా పేరును భారత్‌గా అధికారికంగా రాజ్యాంగ సవరణ ద్వారా మార్చగలరనే ఊహాగానాలకు దారితీసింది. దీంతో ఒక్కసారిగా ఇండియా/భారత్ అనే పదాలపై ఒకింత ఆసక్తికరమైన చర్చ ప్రజాబాహుళ్యంలోకి వచ్చింది.

గతంలో ఈ అంశంపై మూడు సార్లు సుప్రీంకోర్టులో కేసులు దాఖలైనప్పటికీ, రాజ్యాంగ పరిషత్‌లో తప్ప మళ్లీ ఇంత పెద్ద ఎత్తున ప్రజాబాహుళ్యంలో ఎప్పుడూ చర్చకు రాలేదు. అయితే అందరూ ఊహించినట్లుగా పార్లమెంటులో ఈ అంశంపై ఎలాంటి తీర్మానం ప్రవేశపెట్టకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఈ అంశంపై రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చల నుంచి నేటివరకు జరిగిన పరిణామాలను ఒకసారి పరిశీలిద్దాం.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర (యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

రాజ్యాంగ రచన విధానం

రాజ్యాంగాన్ని రూపొందించడం చాలా క్లిష్టమైన పని. సంక్షిప్తంగా చెప్పాలంటే రాజ్యాంగ పరిషత్ సభ్యులు ముందుగా రాజ్యాంగంలో ఏయే నిబంధనలను రూపొందించాలనే విషయాలను పరిశీలించి నివేదించడానికి అనేక కమిటీలను ఏర్పాటు చేశారు. తదనంతరం ఈ కమిటీలు తమ నివేదికలను సమర్పించాయి. వీటి ఆధారంగా వివిధ నిబంధనలను రూపొందించారు. వీటిని ఉపయోగించి రాజ్యాంగ సలహాదారు సర్ బి.ఎన్.రావు రాజ్యాంగ ముసాయిదాను సిద్ధం చేశారు. ఆ తరవాత ముసాయిదాను డ్రాఫ్టింగ్ కమిటీకి పంపారు. అది దానిపై చర్చించి అవసరమైన మార్పులు, చేర్పులను చేసింది. సవరించిన ముసాయిదాను అసెంబ్లీ, ప్రొవిన్షియల్ లెజిస్లేచర్లు, ప్రొవిన్షియల్ ప్రభుత్వాలు, మంత్రిత్వశాఖలు, ఫెడరల్ కోర్టు, హైకోర్టు సభ్యులకు పంపడంతోపాటు ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించడానికి అందుబాటులో ఉంచారు. వారు తమ సూచనలను సమర్పించారు. ఆ తరవాత ముసాయిదా కమిటీ ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దీనిని రాజ్యాంగ పరిషత్ అధ్యక్షునికి సమర్పించారు. ముసాయిదా రాజ్యాంగంపై సుదీర్ఘంగా చర్చించి, దానికి మార్పులు, చేర్పులు చేశారు. ఈ సవరణల ఫలితంగా భారత రాజ్యాంగం రూపుదిద్దుకుంది.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర(యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

భరత్‌వర్ష్ అని పేర్కొనాలి

ఆర్టికల్-1(1) కింద ఈ రాజ్యాంగం ప్రారంభమైన తేదీ నుంచి ఇండియా ఒక సమాఖ్యగా ఉంటుందని సలహాదారు సర్ బి.ఎన్.రావు పేర్కొన్నారు. అయితే బి.ఎన్.రావు ముసాయిదా పంపిణీ చేసినప్పుడు ఈ రాజ్యాంగం ప్రారంభం నుంచి భారతదేశం రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుందన్న వివరణను చేర్చాలని కేంద్ర రాజ్యాంగ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును చివరికి ముసాయిదా కమిటీ రూపొందించిన రాజ్యాంగ ముసాయిదాలో చేర్చారు. ఈ ముసాయిదాను సభ్యులకు సర్క్యులేట్ చేసినప్పుడు ఉపేంద్ర నాథ్ బర్మన్ ఇండియాకు బదులుగా 'భరత్‌వవర్ష్' అనే పదాన్ని డ్రాఫ్ట్ అంతటా ఉపయోగించాలని కోరారు. ఈ సూచనను ముసాయిదా కమిటీ తిరస్కరించింది. కారణం ఇండియా అనే పదం ప్రస్తుతం ఒకటిన్నర శతాబ్దాలకు పైగా వాడుకలో ఉండటమే కాకుండా అంతర్జాతీయంగా కూడా ప్రసిద్ధి చెందింది. కాబట్టి ముసాయిదా అంతటా దానిని భరత్ వర్ష్‌గా మార్చడం మంచిది కాదని రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించిన చివరి ముసాయిదాలో ఇండియా అనే పదాన్ని ఉపయోగించారు.

ఆర్టికల్-1 : ఇండియా అది భారత్: ఆర్టికల్-1పై రాజ్యాంగ పరిషత్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. శిబ్బన్‌లాల్ సక్సేనా ఇండియాను భరత్‌వర్ష్ అని సంబోధించేలా అనేక సవరణలను ప్రవేశపెట్టారు. ఉదాహరణకు 1948 నవంబరు 15న 'యూనియన్ పేరు భారత్' అని ఒక సవరణను ప్రవేశపెట్టారు. అలాగే రాజ్యాంగ అధికారులను కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ ఇండియాగా కాకుండా, కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని కోరారు. అదేవిధంగా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాను చీఫ్ జస్టిస్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని సవరణలను ప్రవేశపెట్టారు. అయితే ఆయన ప్రవేశపెట్టిన సవరణ తీర్మానాలన్నింటినీ రాజ్యాంగ పరిషత్ తిరస్కరించింది.

- 1949 సెప్టెంబరు 17న రాజ్యాంగ పరిషత్ సభా సమావేశం ముగియడానికి అరగంట మాత్రమే మిగిలి ఉంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇండియా అనే పేరును తాను ఇష్టపడతానని స్థిరంగా పేర్కొన్నాడు. చరిత్ర అంతటా, గత సంవత్సరాల్లో భారతదేశాన్ని ఇండియాగా పిలిచేవారు. 'యుఎన్'లో సభ్యునిగా మన దేశం పేరు ఇండియా అని అనేక అంతర్జాతీయ ఒప్పందాలపై ఇండియా అనే పేరుతోనే సంతకం చేసిందని పేర్కొన్నాడు. అయితే ఆశ్చర్యకరంగా 1949 సెప్టెంబరు 17న ఆర్టికల్ '1'ని సవరిస్తూ 'ఇండియా అది భారత్' అని సవరణను ప్రవేశపెట్టారు. ఈ మార్పుపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎలాంటి వివరణను ఇవ్వలేదు.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



నవ్యాంధ్ర టూవీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సేవా శిబిరం



విజయవాడలోని వరద ప్రభావిత రాజీవ్‌నగర్‌లో తాగునీటి సరఫరా



వైఎస్సార్ కాలనీలో ఇంటిని శుభ్రం చేసుకుంటున్న దృశ్యం

సీఎం కార్యక్రమంలో భద్రతా లోపం

» సిద్దరామయ్య పాల్గొన్న వేదిక పైకి దూసుకెళ్లిన యువకుడు

» విధానసౌధ ప్రాంగణంలో ఘటన

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాల్గొన్న సభావేదిక పైకి ఓ యువకుడు దూసుకెళ్లడం కలకలం రేపింది. ఆదివారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విధానసౌధ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప మాట్లాడుతుండగా.. ఓ యువకుడు ఒక్కసారిగా వేదిక పైకి దూసుకువచ్చాడు. కన్నడ కండువా వేసుకున్న ఆ యువకుడు ఓ శాలువాను సీఎంపైకి విసరగా, ఆయన పక్కన ఉన్న వారిపై పడింది. ఆ యువకుడిని బెంగళూరులోని కనకపురకు చెందిన మహదేవ నాయక్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. అతను పలు ప్రశ్నలు వేస్తూ నినాదాలు చేశాడు. ఆ యువకుడు ఏం చెప్పదలచుకున్నాడనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీఎం పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ సీఎం సిద్దరామయ్య పాల్గొన్న రోడ్‌షోలో తుపాకి కలిగిన వ్యక్తి కనిపించడం చర్చకు దారితీసింది. బెంగళూరులో ఇటీవలే రామేశ్వరం కెఫెలో బాంబు పేలుడు జరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత విధానసౌధ ప్రాంగణంలో పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయడం సంచలనమైంది. ఇలా తరచూ భద్రతా వైఫల్యాలు వెలుగులోకి వస్తుండడంతో సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.





వేదికపై సీఎం పక్కన పడిన కండువా, యువకుడిని అదుపులోకి తీసుకుంటున్న భద్రతా సిబ్బంది

పరప్పన జైలుపై సీసీబీ దాడి

» 18 మొబైల్ ఫోన్లు, డ్రగ్స్, నగదు స్వాధీనం

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుపై సీసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. విల్సన్ గార్డెన్ నాగతో పాటు అతని సహచరుల నుంచి 18 మొబైల్ ఫోన్లు, డ్రగ్స్, నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సీసీబీ అధికారులు శనివారం దాడి చేసినట్టు ప్రకటించారు. నగర పోలీస్ కమిషనర్ దయానంద్ సూచన మేరకు దాడి జరిగినట్టు తెలుస్తోంది. ఆగస్టు 24న సీసీబీ అధికారులు పరప్పన జైలుపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే దర్శన్ జైలులో కాఫీ సేవిస్తూ, సిగరెట్ తాగుతూ నలుగురితో కలిసి కుర్చీలో కూర్చున్న ఫొటో వైరల్ అయింది. ఇలా తరచూ జైలుపై దాడులు చేస్తూ అక్రమాలను నివారించవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే దాడులు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే మునిరత్నకు రెండు రోజుల పోలీస్ కస్టడీ

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించారని, కంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలతో బెంగళూరు రాజరాజేశ్వరినగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నకు రెండు రోజుల పోలీస్ కస్టడీ విధించారు. శనివారం సాయంత్రం కోలారు జిల్లా ముళబాగిలు సమీపాన ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు రాత్రి బెంగళూరుకు తీసుకొచ్చారు. ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించి, న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. వారం రోజుల కస్టడీకి పోలీసులు కోరగా.. న్యాయమూర్తి రెండు రోజులకు అనుమతించారు. కాగా మునిరత్నపై చర్యల వెనుక రాజకీయ వేధింపులు లేవని మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ సహా పలువురు వ్యాఖ్యానించారు. మరోమంత్రి సతీశ్ జార్కిహొళి మాట్లాడుతూ.. కులదూషణలు చేయమని తామేమైనా సూచించామా అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షనేత అశోక్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. హోం మంత్రి పరమేశ్వర్ కుట్రపన్ని మునిరత్నను అరెస్టు చేయించారని మండిపడ్డారు.

పాలస్తీనా జెండాతో యువకుల హల్‌చల్

తుమకూరు జిల్లా కుణిగల్‌లో పాలస్తీనా జెండా ఆవిష్కరించేందుకు గత నెల 15న ప్రయత్నించిన ఘటన మరువకముందే చిక్కమగళూరులో పాలస్తీనా జెండాతో ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు హల్‌చల్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఆదివారం చిక్కమగళూరు నగరంలోని ప్రధాన వీధుల్లో ఒకే వాహనంపై ముగ్గురు యువకులు పాలస్తీనా జెండాతో చక్కర్లు కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో హిందూ కార్యకర్తలు చిక్కమగళూరు నగర పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.



అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి కూడలి వద్ద ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు

ఏలేరు కాలువకు గండి

» వెంటనే స్పందించిన జీవీఎంసీ అధికారులు.. గండి పూడ్చివేత

మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా), సెప్టెంబరు 15: కాకినాడ జిల్లా ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖ నగరానికి తాగునీరు సరఫరా చేసే కాలువకు గండి పడింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి కూడలికి సమీపంలో 99.6 కిలోమీటరు వద్ద ఆదివారం ఉదయం సుమారు పది మీటర్ల వెడల్పున భారీ గండిపడింది. అయితే పక్కనే జాగారాల గెడ్డ ఉండడంతో, నీరంతా దానిలోకి ప్రవహించడంతో పంట పొలాలు ముంపుబారిన పడలేదు. సమాచారం అందుకున్న మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు వెంటనే స్పందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్లను రప్పించి ఇసుక బస్తాలు, సరుగుడు కర్రలతో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. కాగా, ఈ ప్రదేశంలో గతంలో కూడా పలుమార్లు గండ్లు పడినట్టు స్థానికులు చెబుతున్నారు. మాకవరపాలెం మండలంలో పలుచోట్ల ఏలేరు కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయని, గండ్లు పడే ప్రమాదం ఉన్నందున వీటిని పటిష్టం చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

అమెరికా ఎన్నికల ర్యాలీలో డీకే శివకుమార్

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఎన్నికల ర్యాలీలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. యూఎస్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం ఎన్నికల ర్యాలీని వీక్షించే అద్భుత అవకాశం లభించిందని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇక్కడ ఎన్నికల ర్యాలీని చూసినపుడు ఎంతో నేర్చుకోవాలని అనిపించిందని పేర్కొన్నారు. ప్రజాశక్తి, ఉత్సాహం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఈ మహత్తరమైన కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా మరిన్ని విషయాలు నేర్చుకోవాలని ఎదురు చూస్తున్నానని తెలిపారు. డీకే శివకుమార్ ఈ నెల 8న అమెరికా పర్యటనకు వెళ్లారు.

మిత్రులతో గడపాలని భర్త వేధింపులు

» ససేమిరా అన్నందుకు దారుణహత్య

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తన మిత్రులతో గడపాలని, అంతవరకు తాకేది లేదని భార్యను వేధించినా ఆమె ససేమిరా అనడంతో దారుణంగా హత్యచేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాదగిరి జిల్లా శెహపుర తాలూకా గంగనాళ గ్రామానికి చెందిన శరణ బసమ్మ (25) జూలైలో హత్యకు గురికాగా.. పోలీసులు ఈ కేసును తాజాగా ఛేదించారు. శరణబసమ్మకు హుణసగి గ్రామక్యాంపులో నివసించే భీమణ్ణ (32)తో 14 నెలల క్రితం వివాహమైంది. మూడు నెలలపాటు అన్యోన్యంగా గడిపారు. ఆ తర్వాత 'నిన్ను తాకాలంటే నా మిత్రులతో గడపాలి' అని ఆమెను భీమణ్ణ వేధించేవాడు. జూలైలో భార్యతో పాటు ఆమె పుట్టినిల్లు గంగనాళ గ్రామానికి వెళ్లిన భీమణ్ణ తలగడతో ఊపిరి ఆడకుండా చేసి శరణ బసమ్మను హత్యచేశాడు. స్పృహ కోల్పోయిందంటూ బంధువులతో కలిసి ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లగా.. మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కాగా ఆమె మృతి అసహజంగా ఉందని వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె మృతికి సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక ఇటీవల రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సొంతూరిలో హత్యచేస్తే పట్టుబడతానని, పుట్టింటిలోనే భార్యను చంపి ఆ తర్వాత ఏమీ తెలియనివాడిలా నటించాడు. చివరకు ఫోరెన్సిక్ నివేదికలో గొంతు నులమడంతో ఊపిరి ఆగినట్టు తేలడంతో భీమణ్ణను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించడంతో హత్య చేసినట్టు అంగీకరించాడు. ఈ మేరకు గోగి పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

3 ఏళ్లు.. 5 వేల వీసాలు.. రూ. 300 కోట్లు

» ఢిల్లీలో నకిలీ వీసా రాకెట్ గుట్టు రట్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు నకిలీ వీసాలు సృష్టిస్తున్న ముఠా ఆటలను కట్టించారు. హరియాణాకు చెందిన సందీప్ అనే వ్యక్తి స్వీడన్ వెళ్లేందుకు ఆదివారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. ఇమ్మిగ్రేషన్ చెక్‌లో సందీప్ వద్ద ఉంది నకిలీ వీసా అని అధికారులు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తన ప్రాంతం నుంచి చాలా మంది ఇలాగే నకిలీ వీసాలతో విదేశాలకు వెళ్లినట్లు చెప్పాడు. తాను ఆసిఫ్ అలీ అనే ఏజెంట్‌కు రూ. 10లక్షలిచ్చి ఈ నకిలీ వీసాను పొందినట్లు చెప్పాడు. పోలీసులు ఆసిఫ్ అలీని అరెస్టు చేసి విచారించగా అతడు మరో ఇద్దరి పేర్లు చెప్పాడు. ఇలా మొత్తం ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. గ్రాఫిక్ డిజైనింగ్ వచ్చిన మనోజ్ మోంగా అనే వ్యక్తి ఈ ముఠాలో కీలక పాత్రను పోషిస్తున్నట్లు తెలుసుకున్నారు. అతను ఢిల్లీలోని తిలక్‌నగర్‌లో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని అందులో యంత్రాలు పెట్టి వాటి ద్వారా నకిలీ వీసాలను రూపొందిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అతడు మూడేళ్లలో 5 వేలకు పైగా నకిలీ వీసాలు రూపొందించాడని, దానికి గాను రూ. 300 కోట్లు అర్జించాడని పోలీసులు తెలిపారు. ఒక నెలలో అతడు 30 నుంచి 60 నకిలీ వీసాలను తయారు చేస్తాడని, ఒక్కో వీసాను రూ. 8 నుంచి 10 లక్షలకు విక్రయిస్తాడని చెప్పారు. జైదీప్ సింగ్ అనే వ్యక్తి మనోజ్‌కు ఈ పని నేర్పించి యంత్రాలు సరఫరా చేసినట్లు తెలుసుకుని అతడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఫుట్‌పాత్‌ని ఆక్రమిస్తే చర్యలు

విజయనగరం రింగురోడ్డు: నగరపాలక సంస్థకి సంబంధించిన స్థలాలు, ఫుట్‌పాత్‌లను కొత్తగా వ్యాపారం చేసేవారు ఆక్రమిస్తే ఊపేక్షించమని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య హెచ్చరించారు. నగరపాలక సంస్థ పరిధిలో బడ్డీలు ఏర్పాటు చేసుకున్న చిరువ్యాపారులు, దుకాణాదారులు ఎటువంటి అద్దెలు, రుసుంలు చెల్లించవద్దని సూచించారు. ఇప్పటివరకూ కార్పొరేషన్ స్థలాల్లో వ్యాపారం చేసుకున్న చిరు వ్యాపారుల నుంచి తాత్కాలిక ఆక్రమణ ఫీజులు వసూలు చేశారని, అయితే కార్పొరేషన్ స్థలాలు ఆక్రమించి కొత్తగా వ్యాపారాలు చేసేవారిని ఉపేక్షించబోమన్నారు. నిబంధనలు పాటించకుండా, ఎవరైనా నగరపాలక సంస్థ స్థలాల్లో బడ్డీలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే నష్టపోతారన్నారు. ఇప్పటికే కార్పొరేషన్ స్థలాల్లో ఏర్పాటు చేసిన వ్యాపార సంస్థలను ఉంచుతామని, వారి నుంచి మాత్రమే తాత్కాలిక ఫీజులు వసూలు చేస్తామన్నారు.

రేపు విద్యుత్ కోత

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం, కల్లెంపూడి, ఎల్‌కేఎస్.పురం, పాటూరు, కొత్తబొద్దాం, ఓబులయ్యపాలెం, ముకుందపురం గ్రామాలకు మంగళవారం విద్యుత్ కోత అమలు చేస్తున్నట్టు విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. ఎల్.కోట సబ్‌స్టేషన్ రూరల్ ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ స్కీములో కొత్తలైను వేయడం కోసం విద్యుత్‌కోత ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కలెక్టరేట్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023-2024కు గాను వివిధ విభాగాల్లో అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి పీఎన్‌వీ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను ఏపీ టూరిజం వెబ్సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ 5వ ఫ్లోర్ స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడలో ఈనెల 22తేదీలోగా అందజేయాలని తెలిపారు.

22 న సకల కళా ప్రదర్శనలు

బొబ్బిలి: కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 22 న ఆనందో బ్రహ్మ ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని శ్రీకళాభారతి ప్రధాన కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆయన విడుదల చేశారు. మహిళలతో శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవం నృత్యరూపకం, శాస్త్రీయ నృత్యవిలాసం, రేలారేలారే రాంప్రసాద్ జానపదనృత్యాలు, ఫ్లాష్ మాబ్, దాడితల్లి బృందంచే కోలాటం, ప్రదర్శన వంటివి ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మింది విజయమోహన్, గంగాధర్, కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ అభ్యర్థి గెలుపు తప్పనిసరి

బొబ్బిలి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలికి జరగనున్న ఎన్నికల్లో ఏపీటీఎఫ్ తరపున సిటింగ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అభ్యర్థిత్వాన్నే ఖరారు చేసినట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు తెలిపారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆదివారం సాయంత్రం సీనియర్ నేత బంకురు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలపై సంపూర్ణమైన అవగాహన కలిగి ఉన్న రఘువర్మ అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా ప్రతిపాదించామని తెలిపారు.

హమాలీ చార్జీ చెక్కుల పంపిణీ

జామి: మండలంలోని అన్నంరాజుపేట, జామి పీఏసీఎస్‌ల ద్వారా 2021-22 ఏడాదికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం దాచేసిన రైతులకు చెల్లించాల్సిన హమాలీ చార్జీలను మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నేతలు పోరాడి సాధించి రైతులకు అందించారు. ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా మండలపార్టీ అధ్యక్షుడు స్వామినాయుడు, మాజీ జడ్పీటీసీ పెదబాబు రైతులకు రావాల్సిన నగదు చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైడిరాజు, సూర్యారావు ఉన్నారు.

వాహన తనిఖీలు

సంతకవిటి: రాజాం కేర్ జంక్షన్ వద్ద సంతకవిటి పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ మధ్య కాలంలో చైన్స్ స్నాచింగ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి పలు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వాహనాలు పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిశీలిస్తున్నారు. రోడపై నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై గోపాలరావు హెచ్చరించారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు

రాజాం రూరల్: దక్షిణభారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో గత రెండ్రోజులుగా నిర్వహిస్తున్న హిందీ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు 187 మందికి గాను 182 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల పరిధిలోని పెనుబాక ప్రాథమికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో దుర్గారావు పర్యవేక్షించారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా కొండవలస మధుసూదనరావు వ్యవహరించారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం, తెర్లాం, చీపురుపల్లి మండలాలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

విజయనగరం టౌన్: రాష్ట్ర 49వ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్-2024లో ప్రతిభ కనబరిచిన విజయనగరం క్రీడాకారులను జిల్లా యోగా సంఘం అధ్యక్షులు అవనాపు విక్రమ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో వరుసగా మూడు, నాలుగు, ఆరు స్థానాలు సాధించిన క్రీడాకారులు అభినందనీయులన్నారు. విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా యోగా క్రీడాకారులు మూడో స్థానాన్ని కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అక్టోబరు నెలలో ఒడిశాలోని కటక్‌లో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన చుక్కా సంధ్యారాణి, ఎం.పావని, మజ్జి గౌతమి, సీర భారతి, కల్లూరి భవానీలను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఒలంపిక్ సంఘం కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అద్భుతాలు సృష్టించాలి

- జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ రాజ్యలక్ష్మి
- ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జేఎన్‌టీయూ వీసీ రాజ్యలక్ష్మి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 15: విజయనగరం జవహర్‌లాల్ నెహ్రూ గురజాడ సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఇంజనీర్స్ డే వేడుకలు ఆదివారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. భారతరత్న మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి ఉప కులపతి ప్రొఫెసర్ బి.రాజ్యలక్ష్మి ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంజినీర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మోక్ష గుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. విద్యార్థులే దేశానికి మూలస్తంభాలని వారి చేతుల్లోనే దేశ భవిత ఆధారపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని ఇంజినీరింగు విద్యార్థులు అద్భుతాలు సృష్టించాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనివర్సిటీ ఇంజినీర్ ఎస్.వేణుగోపాలరావు మాట్లాడుతూ, సివిల్ ఇంజినీరింగు విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ చాలా ముఖ్యమని, ప్రణాళికలు అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్‌ను రాయల్ సివిల్ అంటారన్నారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీర్లకు సత్కారాలు చేపట్టారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగు విభాగాధిపతి(ఇన్‌చార్జి) జి అప్పలనాయుడు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టరు ఆరు గురునాథ, అదనపు పరీక్షల నియంత్రణ అధికారిణి సీ.నీలిమా దేవి, మెకానికల్ ఇంజినీరింగు విభాగాధిపతి కె.శ్రీనివాసప్రసాద్, ఐటీ విభాగాధిపతి సీహెచ్ బిందుమాధురి, ఈసీఈ విభాగాధిపతి టీఎస్ఎన్ మూర్తి, పలువురు ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు. ● **విజయనగరం రింగురోడ్డు:** నగరంలోని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజినీరు కార్యాలయంలో ఆదివారం ఇంజినీర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఇంజినీర్ లక్ష్మణరావు మాట్లాడుతూ, మోక్షగుండం విశ్వేరయ్యని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఇంజినీరు భవిష్యత్‌లో ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు పి.హరి, జి.సురేష్, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు పలువురి వితరణ



బేబీనాయనకు విరాళాలు అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: విజయవాడ ప్రాంతంలో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల నుంచి పలువురు దాతలు ఆపన్న హస్తం అందజేస్తున్నారని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. కోటలో ఆదివారం వివిధ గ్రామాల ప్రతినిధులు వరదబాధితుల సహాయార్థం విరాళాలు ఎమ్మెల్యేకు అందజేశారు. చింతాడ గ్రామ పెద్దలు కర్రి అప్పలనాయుడు, కర్రి తవిటినాయుడు, మరడాన జగ్గునాయుడు, టీడీపీ పెద్దలు, కార్యకర్తలు తమ వంతుగా రూ. 41,000, కారాడ గ్రామ ఆర్యవైశ్య పెద్దలు భగవాన్, బుజ్జి, సురేష్, ఎస్ సత్యనారాయణ, కె.వెంకటేష్, ఎం వాసు, సతీష్ గుప్తా తమవంతుగా 25,000, డాక్టర్ ఎస్‌బీవీ శ్రీకాంత్(సాయి శంకర్ ఆసుపత్రి) 20,000, కింతలివానిపేట వాస్తవ్యులు కింతలి రాము, బొంతలకోటి గోపాలం, రామారావు, నాగరాజు, సింహాచలం, రంగారావు, కృష్ణంరాజు, ప్రజలు తమవంతుగా 15,000, బాడంగి మండలం ఆనవరానికి తామడ సత్యనారాయణ 5,000, తెర్లాం మండలం సుందరాడ గ్రామ టీడీపీ నాయకులు అప్పన్న, మురళి, అర్జునరావు, శ్రీనివాసరావు, ఆర్ మోహనరావు, నాగరాజు, శంకరరావు కలిసి తమవంతుగా 50,000, తెర్లాం మండలం నెమలాం గ్రామ టీడీపీ కమిటీ వారు తమవంతుగా 10,000, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు మసిలామణి 20,000, ఎక్సైజ్ సీఐ చిన్నంనాయుడు 10,000, వై ప్రసాదరావు, నానివాణి ప్రసాద్ 10,000, చిట్టిబాబు 5,000, విక్టర్‌బాబు 5,000, వినయ్ 5,000, పలగర అప్పయ్య 2,000, ప్రసాదరావు 1,000, రామభద్రపురం మండలం కోటసిర్లాం గ్రామ సర్పంచ్ తాడ్డి శ్రీనివాసరావు, టీడీపీ పెద్దలు, కార్యకర్తలు కలిసి తమవంతుగా 30,000, కొండకెంగువ గ్రామ మాజీ సర్పంచ్ సిరిపురపు శ్రీనివాసరావు, టీడీపీ పెద్దలు, కార్యకర్తలు కలిసి తమవంతుగా 25,000, పాతరేగ గ్రామ టీడీపీ పెద్దలు, కార్యకర్తలు కలిసి తమవంతుగా 10,000, బాడంగి మండలం జీకేఆర్‌పురం గ్రామ టీడీపీ పెద్దలు వంగపండు సత్యనారాయణ, పూడి సింహాచలం, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, సత్యం కలిసి తమవంతుగా 20,000, వీరసాగరం గ్రామ టీడీపీ నాయకులు ఈశ్వరరావు, దాలినాయుడు, శ్రీనివాసరావు, శేషగిరి, మోహనరావు, మోహనరావు కలిసి 20,000 విరాళాలు బేబీనాయనకు అందజేశారు.

● **సంతకవిటి:** వరద బాధితుల సహాయార్థం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోండ్రు మురళీమోహన్ ఆదేశాల మేరకు రాష్ట్ర తూర్పుకాపు సంఘం మాజీ ఛైర్మన్ కొల్ల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు కృష్ణంవలస గ్రామ ప్రజలు ముప్పై వేల రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొల్ల అప్పలనాయుడు మాట్లాడుతూ వరద బాధితులకు తమ వంతు సహాయం చేసి ఆదుకునేందుకు ప్రజలందరూ ముందుకు రావాలన్నారు. భాను, గణేష్ పాల్గొన్నారు. ● **విజయనగరం రింగురోడ్డు:** ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం, జన విజ్ఞానవేదిక సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విరాళాల సేకరణ ఏర్పాటు చేశారు. విరాళాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు ఎ ఆనంద్, గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు జి.చిరంజీవి, భవానీ, గుప్తా పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బైకు ర్యాలీ



బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న మాలమహానాడు నేత సాంబయ్య

బొబ్బిలి: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బొబ్బిలి పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర బైకు ర్యాలీని అంబేద్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ వర్గీకరణలో శాస్త్రీయత లేదని, అంబేద్కర్ మహనీయుడు ఆశయాలకు భిన్నంగా పాలకులు స్వార్థపూరితంగా అణగారిన కులాల మధ్య చిచ్చు రగులుస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా సమీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బైకు ర్యాలీ అంబేడ్కర్ జంక్షన్ నుంచి ప్రారంభమై ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే జంక్షన్, బలిజిపేట రోడ్డు, ఓంకార్ జంక్షన్, మెయిన్‌బజారు, దక్షిణదేవిడి మీదుగా కొనసాగింది. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంఘాల నాయకులు కౌలు చిరంజీవులు, బొక్కెన రాము, ఎండ గోపాలరావు, బి.శ్రీనివాస్, సూర్యనారాయణ, గోపాలం, మురళి, జగదీశ్, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాల పంట



క్రీడాకారులతో మంత్రి కొండపల్లి

విజయనగరం టౌన్: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈ నెల 8 నుంచి 10 వరకూ నిర్వహించిన జాతీయ సబ్‌జూనియర్ తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. విజయనగరానికి చెందిన క్రీడాకారులు ఎనిమిది పతకాలు సాధించారు. వీరిలో కె.సాహిత్య(బంగారు, కాంస్య పతకం), పి.పునీత్, ఎస్.సాత్విక్, బి.కుషల్ (రజత పతకాలు), పి.పునీత్‌కు మరో రెండు కాంస్య పతకాలు, కుశల్‌కు మరో కాంస్య పతకం లభించాయి. పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందిస్తూ, రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, అవనాపు విజయ్, కోచ్ సీహెచ్ యశస్విని, గోపి, గగన్‌లను అభినందించారు.

విజయనగరం జట్టు విజయం



విజయనగరం-తూర్పుగోదావరి జట్ల మధ్య మ్యాచ్

విజయనగరం టౌన్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని విజ్జీ మైదానంలో విజయనగరం-తూర్పుగోదావరి జట్ల మధ్య అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లో విజయనగరం జట్టు అద్భుత విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 127 పరుగులకే ఆలౌట్ కాగా, తూర్పుగోదావరి జట్టు 209 పరుగులకు ఆలౌట్ అయి 82 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో విజయనగరం జట్టు 251 పరుగులకు ఆలౌట్ కాగా, తూర్పుగోదావరి జట్టు 163 పరుగులకే ఆలౌట్ అయి, 6 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ● దెంకాడ మండలం చింతవలస ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో విశాఖజట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో విజయం సాధించింది.

స్టాఫ్‌నర్సే ఆధారం



వైద్యసేవలు అందిస్తున్న స్టాఫ్‌నర్స్

జామి: ఆదివారం వస్తే పలు పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయి సిబ్బంది కనిపించరు. ఒక్క స్టాఫ్ నర్సే ఆధారంగా వైద్యం సాగుతుంది. అలమండ పీహెచ్‌సీను పరిశీలించగా అక్కడ వైద్యులు, ఇతర సిబ్బంది ఎవ్వరూ లేరు. ఒక స్టాఫ్‌నర్సు మాత్రమే వచ్చిన వారికి వైద్యం చేసి పంపిస్తోంది. ఈ విషయంపై సదరు స్టాఫ్‌నర్సును ప్రశ్నిస్తే ఆదివారం పూట మూడు షిఫ్ట్‌ల్లో మేమే వంతుల వారీగా [illegible] తెలిపారు. ఇదే విషయంపై వైద్యాధికారి పద్మజ వివరణ కోరగా ఆదివారం అందరికి సెలవు అని అత్యవసరం అయితే వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

రేపటి నుంచి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు

విజయనగరం రింగురోడ్డు: స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రూపొందించి అమలు చేస్తున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. 15 రోజుల పాటు ఈ కార్యక్రమలను రూపొందించామని, 17న ఉదయం 7.30 గంటలకు అయ్యన్నకోనేరు వద్ద స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. అయ్యన్నకోనేరు వద్ద మానవహారంగా ఏర్పడి చెరువు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నారన్నారు. 18న ఉదయం 8 గంటలకు సీఎంఆర్ జంక్షన్ నుంచి మహారాజా కళాశాల వరకూ స్వచ్ఛత నడక కార్యక్రమం, ఉదయం 10.30 గంటలకు రాజీవ్‌నగర్ కాలనీలో పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్సపై శిక్షణ కార్యక్రమం, మధ్యాహ్నం 3 గంటలకు అయ్యన్నపేట కామాక్షినగర్ ప్రాంతంలో దోమల వృద్ధి కేంద్రాల ప్రక్షాళన, 19న బాబామెట్ట గర్ల్స్ పాఠశాల, కస్పా హైస్కూల్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ, వై జంక్షన్ వద్ద సంపూర్ణ శ్రమదానం, 20న మొక్కలు నాటే కార్యక్రమం, బొంకుల దిబ్బ వద్ద సంపూర్ణ శ్రమదానం, 21న అంబటిసత్తర్వు నుంచి రాక్ గార్డెన్ వరకూ పార్కులో పరిశుభ్రత కార్యక్రమం ఉంటాయన్నారు. 22న నగరపాలక సంస్థ కార్యాలయంలో పరిశుభ్రత కార్యక్రమం, 23న ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమం, 24న తాగునీటి నిర్వహణ, శుభ్రత కార్యక్రమాలు, 25న నగరపాలక సంస్థ కార్యాలయంలోని గణేష్ ఆలయం వద్ద బృంద కార్మికులచే పరిశుభ్రత, 26న కలెక్టరేట్ కార్యాలయం, ఆర్ అండ్ బీ జంక్షన్‌లో శ్రమదాన కార్యక్రమాలు, 27న అన్ని డివిజన్లలో డివిజన్ సభలు, 28న కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి మూడు లాంతర్ల వరకూ రహదారుల పరిశుభ్రత, 29న గుణుపూర్‌పేట డంపింగ్ యార్డు వద్ద వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన కార్యక్రమాలు, 30న బాబామెట్ట, బ్యాంకు కాలనీలో చెత్త వర్గీకరణ, రీ సైకింగ్ నైపుణ్యతపై అవగాహన కార్యక్రమాలు, అక్టోబరు 1న ఆర్టీసీ కాంప్లెక్స్, కోడిరామమూర్తి వ్యాయామశాల, కలెక్టరేట్ ప్రాంతాల్లో ఉన్న సామాజిక మరుగుదొడ్ల శుభ్రత కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వచ్ఛాహి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేషన్ డిపో ఏర్పాటు చేయాలి

లక్కవరపుకోట: తమ గ్రామానికి ప్రత్యేకంగా రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కొత్తవలస మండలం గొల్లలపాలెం గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. గొల్లలపాలెం గ్రామ సర్పంచ్ నంబారు మంగమ్మ ఆధ్వర్యంలో టీడీపీ నేతలంతా కలిసి ఎల్.కోటలో ఎమ్మెల్యే నివాసం వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. రేషన్ తీసుకోవాలంటే గ్రామస్థులంతా ఆరు కిలోమీటర్లు నడిచి వియ్యంపేట వెళ్లి తీసుకోవాల్సి వస్తోందన్నారు. గ్రామంలో [illegible] భవనం, స్కూల్ స్థలాన్ని ప్రైవేట్ సైట్లు జగనన్న కాలనీకి కేటాయించడంతో, పాఠశాల ప్రహరీ, ఇంటింటి కుళాయి వంటి సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించారు.

వైకుంఠ నారాయణునికి పంచామృతాభిషేకాలు



విజయనగరం రింగురోడ్డు: ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం రామనారాయణం ప్రాంగణంలో వైకుంఠ నారాయణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం శ్రవణనక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు, [illegible] శ్రీ హర్ష తేజ వేదమంత్రాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీలవల్లి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



పావని (ఫైల్)

కొత్తవలస: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసు కుంది. దీనికి సంబంధించి సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస జడ్పీ హైస్కూల్ వెనుక ఉన్న వెంకట శివనగర్‌కు చెందిన గొలగాని పావని(24)కి అదే గ్రామానికి చెందిన హరికృష్ణతో ఏడేళ్ల క్రితం పెళ్లయింది. ప్రేమ వివా హం చేసుకున్న వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. హరికృష్ణ కార్ డ్రైవర్‌గా పనిచేస్తు న్నాడు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు లోనై తరచూ భార్యను కొట్టడమే కాకుండా మానసికంగా, శారీరకంగా హింసలకు గురిచేసేవాడు. భర్తపెట్టే హింసలు భరించలేక మనస్తాపానికి గురైన పావని శనివారం అర్ధరాత్రి ఇంటిలోని సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరే సుకుంది. సమీపంలోనే నివసిస్తున్న పావని తండ్రి సన్యాసిరావు కుమార్తె ఇంటికి వచ్చి తలుపుకొట్టగా తీయకపోవడంతో కిటికీలోనుంచి చూడగా చీరతో ఉరివేసుకుని ఉండ డం గమనించాడు. వెంటనే స్థానికుల సహకారంతో 108లో చికిత్స నిమిత్తం విశాఖ పట్టణం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. ఈ సమయంలో భర్త హరి కృష్ణ ఇంటిలోనే ఉన్నాడు. తన అల్లుడి వేధింపుల వల్లే కుమార్తె ఆత్మహత్య చేసుకుంద ని మృతురాలి తల్లి మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కొత్తవలస తహసీల్దార్ నీలకంఠం సమక్షంలో మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం తరలించామన్నారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నదిలో పడి వృద్ధుడి మృతి

సాలూరు రూరల్: సువర్ణముఖి నదిలో పడి కాషాయవలస గ్రామానికి చెందిన కూనేటి వీరయ్య(54) మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం దండిగాం జలపాతం వద్ద ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, సాలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ పి.నర్సింహమూర్తి వెళ్లి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తొలుత గుర్తు తెలియని మృతదేహంగా భావించి, కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా కూనేటి వీరయ్య శనివారం నుంచి కనిపించకపోవడంతో అతని తమ్ముడు పుద్దయ్య బంధువులు గాలిస్తూ దండిగాం వచ్చారు. మృతదేహాన్ని చూసి, వీరయ్యదిగా గుర్తించారు. వీరయ్యకు భార్య, పిల్లలు లేకపోవడంతో తమ్ముడు పుద్దయ్య ఇంటి వద్దే ఉంటున్నాడని చెప్పారు. మతిస్థిమితం ఉండదని, ఎప్పటికప్పుడు గుర్రప్పవలస తదితర గ్రామాలకు వెళ్లి వస్తూ ఉంటాడని తెలిపారు. ఈక్రమంలో మిర్తిగుడ్డివలస మీదుగా సువర్ణముఖి నది దాటినప్పుడు ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉంటాడని పలువురు భావిస్తున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

గర్భిణి మృతి

వీరఘట్టం: మండలంలోని కనోసా ఆస్పత్రిలో వారాడ నవ్య(22) అనే గర్భిణి ఆదివారం మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. దశమంతపురం గ్రామానికి చెందిన ముంగటి లక్ష్మునాయుడు, సీతామహాలక్ష్మిల కుమార్తె నవ్యను జియ్యమ్మవలస మండలం ఇటుక గ్రామానికి చెందిన వారాడ సోమశేఖర్‌కి ఇచ్చి పెళ్లి చేశారు. అయితే నవ్యకు నెలలు నిండడంతో శనివారం కనోసా ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం ప్రసవ సమయంలో గర్భిణితో పాటు కడుపులో ఉన్న బిడ్డ మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కళాధర్, సీఐ చంద్రమౌళి ఆస్పత్రి వద్దకు చేరుకుని, సర్ది చెప్పారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రామభద్రపురం: మండల పరిధిలోని ముచ్చర్లవలస గ్రామంలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.54వేల 320లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. వీరిపై కేసు నమోదుచేసి కోర్టుకు తరలిస్తామన్నారు. మండలంలో జూదం, మద్యం బెల్టుషాపులు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర, పోలీసు కానిస్టేబుళ్లు రవి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల కలయిక



సమావేశమైన పూర్వవిద్యార్థులు

బొబ్బిలి: సంస్థానం హైస్కూలులో 1986-91 బ్యాచ్‌కు చెందిన నాటి విద్యార్థులంతా ఆదివారం సమావేశమయ్యారు. స్థానిక ఓ కళాశాలలో సంఘ ప్రతినిధులు సల్మాన్‌రాజు, జీవీరమణ, ఎస్ఎస్ఎమ్ రమేష్ ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థులంతా సమవేశమై హైస్కూలులో చదివే రోజుల్లోని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులంతా ఎంత నిబద్ధతతో చదువు చెప్పారో చర్చించుకున్నారు. వారు నేర్పిన క్రమశిక్షణ, బోధించిన విద్యద్వారానే తామంతా ప్రయోజకులుగా ఎదిగామని గురువులకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి పాదపూజ చేశారు. రోజంతా సందడిగా గడిపారు.

గొడుకొమ్ములో పోలీస్ బందోబస్తు



నిమజ్జనం ముందు గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

జామి: మండలంలోని గొడుకొమ్ము గ్రామంలో ఆదివారం నిర్వహించిన గణపతి నిమజ్జనం కార్యక్రమానికి సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్‌బందోబస్తు నిర్వ హించారు. మూడు రోజుల క్రితం ఈ గ్రామంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనంలో వైసీపీ శ్రేణులు టీడీపీ వారిపై దాడికి దిగడంతో ఒక యువకుడు గాయపడిన నేపథ్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. సాయంత్రం గ్రామానికి చేరుకున్న సీఐ రవికుమార్ మాట్లాడుతూ పండుగలు ప్రశాంతంగా చేసుకోవాలని, అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎస్ఐ వీరజనార్దన్, గ్రామపెద్దలు ఉన్నారు.

నైపుణ్యాన్ని వెలికితీయడమే క్రీడల లక్ష్యం



మాట్లాడుతున్న కోండ్రు

రాజాం: యువతలో నైపుణ్యాన్ని వెలికితీయడమే క్రీడల లక్ష్యమని, యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2024 క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమే అన్నారు. గత 16 ఏళ్లుగా స్వర్గీయ కొన్న చిన్నారావు పేరుమీద క్రీడల పోటీలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులను కోండ్రు అభినందించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు కృష్ణ పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు మొమెంటోలు అందజేశారు.

బొబ్బిలిలో హాల్ట్ కల్పించండి

- నేడు వందే భారత్ రైలు ప్రారంభం

బొబ్బిలి: దుర్గ్ నుంచి విశాఖకు సోమవారం ప్రారంభంకానున్న వందేభారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ లేకపోవడంతో అన్ని వర్గాల్లో అసంతృప్తి నెలకొంది. బొబ్బిలి రైల్వే జంక్షన్ నుంచి ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు అటు విశాఖ, ఇటు రాయగడ వైపు రాకపోకలు సాగిస్తుంటారు. అంత ప్రాధాన్యత కలిగిన వందే భారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ లేకపోవడం చాలా అన్యాయమని ఈ ప్రాంత ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రైలుకు తొలుత పార్వతీపురంలో కూడా హాల్ట్ లేదు. అరకు ఎంపీ, పార్వతీపురం ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి రైల్వేశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి హాల్ట్‌ను సాధించుకున్నారు. ఈనేపథ్యంలో బొబ్బిలిలో కూడా శాంతియుతంగా ఉద్యమం చేపట్టేందుకు యోచిస్తున్నారు.

డిమాండ్‌ను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్తా..

బొబ్బిలిలో వందేభారత్ రైలుకు హాల్ట్ పెట్టాలన్న జనం డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళతా. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎంపీ అప్పలనాయుడుకు సమస్యను వివరిస్తాను. అవసరమైతే రైల్వే సౌకర్యం కోసం కూడా గళంలో అడిగాం. మళ్లీ మరోసారి అడుగుతాం.

- బేబీనాయన, బొబ్బిలి ఎమ్మెల్యే

సీతారాం ఏచూరికి ఘన నివాళి

బొబ్బిలి రూరల్: మండలంలోని బొడ్డవలస పంచాయతీ, వెంకటిరాయుడుపేట గ్రామాల్లో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ సభ్యులు శంకర్, రమణమ్మ, కూలాలి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

● **విజయనగరం దాసన్నపేట:** పేదల పక్షపాతి సీతారాం ఏచూరి అని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు కొనియాడారు. ఆదివారం నగరంలోని రామకృష్ణానగర్‌లో ఏచూరి సంతాప సభ నిర్వహించి నివాళులు అర్పించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: బొడ్డవలసలో



విజయనగరం: నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

వంతెన పనులెప్పుడో?

● దండిగాం-కురుకూటి మధ్య సువర్ణముఖి నదిపై శిథిలమైన కాజ్‌వే ● వరద సమయంలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గిరిజనులు

● నిధులు మంజూరైనా పనులు ప్రారంభించని వైనం

సాలూరు రూరల్: దండిగాం, కురుకూటి మధ్య సువర్ణముఖి నదిపై వంతెన నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని పలు గ్రామాల గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. కురుకూటి, దండిగాం గ్రామాల మధ్య సువర్ణముఖి ప్రవహిస్తున్నది. ఈ నదిపై కాజ్‌వే నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నాయి. ఈ కాజ్‌వే శిథిలమయ్యింది. సువర్ణముఖి నదికి ఎప్పటికప్పుడు వరద పోటెత్తడంతో కాజ్‌వేపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో కురుకూటి ఎగువన ఉన్న దళాయివలస, బట్టివలస, రూడి, సంపంగిపాడు తదితర గ్రామాల గిరిజనుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ సమస్య గత ప్రభుత్వంలో అప్పటి డిప్యూటీ సీఎం రాజన్నదొర దృష్టికి రావడంతో వంతెన నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు చేయించారు. నిధులు మంజూరైనా గత ప్రభుత్వంలో పనులకు గుత్తేదారులు ముందుకు రాలేదు. దీంతో నిధులున్న వంతెన పనులకు శ్రీకారం చుట్టలేకపోయారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో సువర్ణముఖి నదికి వరద పోటెత్తుతున్నది. ఈ వరదకు ఈనెల 6న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఆరుగురు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నిధులున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వంతెన పనులు సత్వరమే ప్రారంభించాలని గిరిజనులు కోరుతున్నారు.



శిథిలమైన దండిగాం కాజ్ వే

సమస్యల పరిష్కారానికి చర్యలు

● మంత్రి నివాసంలో ప్రజా దర్బార్



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంక్షేమశాఖ అధికారులు

సాలూరు: సాలూరులోని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నివాసంలో ఆదివారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది తమ సమస్యలతో రాగా, మంత్రి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పాచిపెంట మండలం గడివలస గ్రామానికి చెందిన బెవర త్రినాథ.. తనకు గత ప్రభుత్వం పింఛన్ రద్దు చేసిందని, పునరుద్ధరించాలని కోరగా.. ఆమె వెంటనే ఎంపీడీవోకు ఫోన్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. సాలూరులోని మీసేవా కేంద్రంలో గతంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసిన తమను తిరిగి ఉద్యోగులుగా చేర్చుకోవాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రమణమూర్తితో పాటు పలువురు అధికారులు మంత్రిని కలిసి, తమ శాఖలో ఎప్పటి నుంచో అమలు కాని పదోన్నతులను అమలు చేయాలని కోరగా.. మంత్రి దానికి సానుకూలంగా స్పందించారు. జాబితాను రూల్ ఆఫ్ రిజర్వేషన్, సినియార్టీని ఆధారంగా చేసుకుని సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గంలో ప్రతి గిరిజన సంక్షేమశాఖ పాఠశాల, కళాశాలలో ఎక్కడా కూడా సిబ్బంది లేరనే మాట వినపడకూడదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు(చిట్టి) పరమేష్, కొరిపిల్లి సురేష్, హర్షవర్ధన్, తోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కేసలి పంచాయతీ కుమ్మరివలస గ్రామానికి రూ.4కోట్లతో బీటీ రోడ్డు మంజూరు చేసినందుకు ఆ గ్రామస్థులు మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాలూరులోని ఆమె నివాసం వద్దకు వెళ్లి, ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏపీఎంపై వెలుగు వీవోల ఫిర్యాదు

● సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి /కురుపాం: మండలంలో పనిచేస్తున్న వీవోఏలు ఇచ్చిన ఫిర్యాదుపై వెలుగు ఏపీఎం ఈవీ కిషోర్‌ను సెర్ప్ సంస్థకు సరెండర్ చేస్తూ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో పనిచేస్తున్న వీవోఏలకు ఇచ్చిన గౌరవ వేతనం నుంచి కొంత మొత్తాన్ని తీసుకుంటున్నారని వారు ఫిర్యాదు చేశారు. అలాగే కురుపాంలో ఓ మహిళా పొదుపు సంఘంలో ఉన్న ఆరుగురు సభ్యులు స్త్రీనిధిలో రూ.3లక్షల రుణం తీసుకున్న డబ్బులు వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తి సమీప బంధువు ఖాతాలోనికి మళ్లించి ఫిర్యాదు చేయడంతో, నిధులు దుర్వినియోగం చేస్తున్నారని సెర్ప్ సీఈవో, కలెక్టర్, ఉన్నతాధికారులకు వీవోలు ఫిర్యాదు చేయడంతో, కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాలతో డీఆర్‌డీఏ పీడీ విచారణ చేసి ఆర్థిక అవకతవకలు గుర్తించినట్టు తెలిసింది. డీఆర్‌డీఏ పీడీ ఇచ్చిన నివేదిక మేరకు కలెక్టర్ శ్యాంప్రసాద్ సెర్ప్ సంస్థకు సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరోగ్యశ్రీ పేదలకు వరం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న రామమోహనరావు దంపతులు

పార్వతీపురంటౌన్: ఆరోగ్యశ్రీ సేవలు పేదలకు వరం అని కర్షక మహర్షి ఆసుపత్రుల డైరెక్టర్ ద్వారపురెడ్డి రామమోహనరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కర్షక మహర్షి ఆసుపత్రిలో ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం ఆయన ఆరోగ్య సేవలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా మరిన్ని వైద్య సేవలు అందించేందుకు అవకాశం దొరికిందన్నారు. అతి త్వరలో రోగులకు అన్ని రకాల వైద్య సేవలను అందించడానికి ఇంకా వైద్యులను తీసుకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్షక మహర్షి ఆసుపత్రి ముఖ్య గైనకాలజిస్టు డి.ప్రతిమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో తవ్వకాలు చేపడితే అడ్డుకుంటాం

పార్వతీపురం రూరల్: తమ ప్రాంత ప్రజలకు ఆరాధ్య దైవమైన బడిదేవరకొండ వద్ద క్వారీ తవ్వకాలకు అనుమతులు మంజూరు చేయడం దారుణమని, దీనిని ఖండిస్తున్నామని ములగ సర్పంచ్ మడక కృష్ణవేణి, మాజీ సర్పంచ్ మడక విశ్వనాథం తెలిపారు. ఈ ప్రాంతంలో తవ్వకాలు చేపడితే పార్టీలకు తీతంగా ఏకమై క్వారీ తవ్వకాలు అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల మనోభావాలను గౌరవించి ఈ ప్రాంతంలో మంజూరు చేసిన తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని వారు కోరారు. క్వారీ తవ్వకాలు చేపడితే అడ్డుకుంటామని టీడీపీ నాయకులు రెడ్డి చిన్నమనాయుడు, రెడ్డి శివ స్పష్టం చేశారు.

బడిదేవరకొండపై వరదపాశం

పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయాలు ప్రకారం తమ ప్రాంతాల్లో మంచి పంటలు పండాలని కోరుతూ బడిదేవరకొండ వద్ద డి.ములగ, ఎన్.ములగ, పెండిలోవ, కోరి గంగాపురం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు బడిదేవరకొండ వద్ద ఆదివారం వరదపాశం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

జ్వరంతో మహిళ మృతి

భామిని: మండలంలోని నేరడి గ్రామానికి చెందిన పి.రమణమ్మ (58) జ్వరంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. గత రెండు రోజులుగా జ్వరం ఉన్నప్పటికీ పొలం పనులు, వినాయక మండపంలో చురుగ్గా పనులు చేసింది. అయితే శనివారం రాత్రి ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను శ్రీకాకుళం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త సింహాచలం, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సూర్యపీఠంలో ప్రత్యేక పూజలు



పుష్పాంజలి సేవలో ఆర్డీవో

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్ర శివారులోగల శ్రీసూర్యపీఠంలో పీఠాధిపతి వేమకోటి నరహరశాస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం సౌర హోమాలు, సూర్య నమస్కారాలతో పాటు నవనాగ అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో జిల్లా ఆర్డీవో దుర్గాప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. సౌరయాగశాలలో సకల దేవతా ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. అనంతరం ఆర్డీవోకు నరహరశాస్త్రి స్వామివారి వస్త్రాలను అందజేశారు. వేమకోటి వివేకానందశర్మ వైదిక సహాయాన్ని అందించారు.

సుభద్ర యోజనపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ పారుల్ పట్వార్

ఒడిశా

రాయగడ: మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుభద్ర యోజన పథకంపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన పాదయాత్రను కలెక్టర్ పారుల్ పట్వార్ ఆదివారం ప్రారంభించారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ప్రారంభమైన ఈ యాత్ర సమితి కార్యాలయం మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో వివిధ స్వయం సహాయక మహిళా బృందాలు, సుభద్ర యోజన దరఖాస్తుదారులు సుమారు 300కు పైగా మహిళలు పాల్గొన్నారు. తొలుత స్థానిక జడ్పీ సమావేశ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో సుభద్ర యోజన నిర్వాహణపై వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రొయిత్, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి, డీపీసీ మమతా జితేంద్రకుమార్ మహాపాత్ర, జిల్లా క్రీడాధికారి షేక్ అలెనూర్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లేవిటి నుంచి నీలకంఠాపురం ప్రధాన రహదారి వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి ఆ గ్రామ ప్రజలు ఆదివారం వినతిపత్రం అందించారు. గుమ్మలక్ష్మీపురంలోని తన స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో వైద్యసేవలు అందడం లేదని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేంద్రపురం గ్రామానికి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తానని, రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని కుద్దిలి వీధిలో ఎం.సీత ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక హెచ్‌సీ వాల్మీకి, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం కుద్దిలి వీధిలోని సీత ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో టీవీతో పాటు బీరువాలోని దుస్తులు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సకాలంలో వీధివాసులు స్పందించడంతో పెద్ద అగ్ని ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదానికి సంబంధించి సమగ్ర దర్యాప్తు చేస్తామని హెచ్‌సీ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో ఆదివారం విజిలెన్స్ అధికారులు 6,500 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా విజిలెన్స్ ఎస్పీ బి.ప్రసాద్ ఆదేశాల మేరకు ఉల్లిభద్రలోని ఇర్ఫాన్ కోళ్ల ఫారంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వచేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామారావు, పౌర సరఫరాల ఉప తహసీల్దార్ రమణారావు తెలిపారు. రేషన్ బియ్యం నిల్వ చేసిన కోళ్ల ఫారంను సీజ్ చేశారు. అలాగే యజమాని ఇర్ఫాన్, బిడ్డిక సూరన్నలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

సాలూరు: సాలూరులో ఉన్న రామా యోగా ట్రస్ట్‌లో యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ట్రస్ట్ ఫౌండర్, అధ్యక్షురాలు ఆరిశెట్టి ఇందుమతి సోమవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. యోగా ఫెడరేషన్‌కు అనుబంధంగా ఉన్న ఏపీ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో 49వ రాష్ట్ర స్థాయి యోగా పోటీలు ఈనెల 14, 15 తేదీల్లో విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో నిర్వహించారని తెలిపారు. అందులో సాలూరుకు చెందిన చుక్క సంధ్యారాణి, పెద్దిరెడ్డి రూపవతి, మజ్జి గౌతమి ఎంపికైనట్లు ఆమె చెప్పారు. వీరంతా తర్వాత జరిగే స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. వీరి ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వరద బాధితులకు విరాళాలు



విరాళాలు అందిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు ముందుకు వస్తున్నారు. ఆదివారం నాగూరుకు చెందిన వెంకట గాయత్రి, శ్రీకోదండ రామ రైస్, ఆయిల్ మిల్, శ్రీవెంకట రామాంజనేయ ట్రేడర్స్ ప్రతినిధులు రూ.15వేలను టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావుకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపుమేరకు విరాళాలను సేకరించి అందిస్తామని చెప్పారు. అలాగే ఖడ్గవలసకు చెందిన కిమిడి శ్రీరామ్మూర్తి రూ.10,016లు వరద బాధితులకు విరాళం ప్రకటించారు. తోటపల్లిలోని ధర్మ పక్షం తరఫున జట్టు సంస్థ వ్యవస్థాపకులు డా.డి.పారినాయుడు ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు.

భజన పోటీలు

పాలకొండ: వినాయక ఉత్సవాల్లో భాగంగా యాలం జంక్షన్‌లో ఆదివారం పాలకొండ డివిజన్ స్థాయి భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన పాపమ్మ భజన బృందం ప్రథమ స్థానం పొందింది. అన్నవరం, కాగితాపల్లి భక్త భజన బృందాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

గిరిజన గ్రామాల్లో వైద్యసేవలపై ఆరా



గర్భిణితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహనరావు

సాలూరు రూరల్: మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహనరావు ఆరా తీశారు. దిగువ దాగరవలస, తాడిలోవ, పెద్దవలస గిరిజన గ్రామాల్లో డీపీఎంవో రఘు కుమార్‌తో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. మాతా, శిశు సంక్షేమ కార్డుల గర్భిణులు, శిశువుల ఆరోగ్య తనిఖీ వివరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్య కేంద్రాలకు వెళ్లాలంటే ఎంత దూరం పయనించాలని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా వైద్య శిబిరాలు జరుగుతున్నది లేనిది గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. కాగా, ప్రజల ఆరోగ్య పరిరక్షణపై వైద్యులు, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత, హైరిస్క్ కేసులను గుర్తించాలన్నారు. వివిధ సూచనలు చేశారు. ఆయనతో బాగువలస వైద్యాధికారి రవికిరణ్, సూపర్‌వైజర్ కొల్లి నాగేంద్ర, సతీష్ తదితరులు ఉన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023-24 సంవత్సరానికి వివిధ విభాగాల్లో అవార్డులకు అర్హులైన పర్యాటక సంబంధిత రంగాల వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తులను ఏపీ టూరిజం వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి, పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఐదో ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడలో ఈనెల 22వ తేదీలోగా అందించాలన్నారు.

2 వరకు స్వచ్ఛతా హి సేవ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: స్వచ్ఛభారత్ దినోత్సవం సందర్భంగా అక్టోబరు 2 వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ-2024 నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ముఖ్యమైన మైలు రాయిగా నిలిచిపోతుందన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి మారథాన్‌లు, సైక్లోథాన్‌లు, మానవహారాలు నిర్వహణ, మొక్కల పెంపకంతో పాటు ఇతర సుందీరకరణ పనులు చేపట్టాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

● పాఠశాల వజ్రోత్సవాల ఏర్పాటుకు నిర్ణయం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వీరఘట్టం: వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలను నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాలకు 75 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా 8 జూన్ 2025 తేదీన వజ్రోత్సవాలను నిర్వహించడానికి విద్యార్థులు తీర్మానించారు. ఈ కార్యక్రమానికి సుమారు 2,500 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యేలా ప్రణాళిక రచిస్తున్నారు. ఇందు కోసం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఒక్కో బ్యాచ్ నుంచి ముగ్గురు చొప్పున కమిటీని ఏర్పాటు చేసి అందరికీ సమాచారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా..

కలెక్టర్‌ను కలిసిన విజిలెన్స్ ఎస్పీ



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న విజిలెన్స్ ఎస్పీ

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్.. కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజిలెన్స్ ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.

గిరిజన గ్రామాల్లో జన్‌మన్‌పై సర్వే

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గిరిజన గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకం అమలుకు సర్వే చేస్తున్నారు. ఈ పథకంపై గ్రామ సభలు పెట్టి పీటీజీ గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, రహదారులు ఇతర మౌలిక వసతులతో పాటు ఉపాధి కల్పన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ అభ్యర్థులకు శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం వైటీసీలో పరీక్షలు రాయనున్న ఉపాధ్యాయ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం గిరిజన సంక్షేమ శాఖ దరఖాస్తులను ఆహ్వానించారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో కనీసం 150 మందికి తక్కువ లేకుండా మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఉత్తర్వులు అందిన వెంటనే ఈ శిక్షణా కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏలో ప్రతివారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా రద్దు చేస్తున్నట్టు ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఐటీడీఏకు రావొద్దని సూచించారు.

ఇద్దరు పేకాట రాయుళ్లు అరెస్టు

సీతంపేట రూరల్: మండలంలోని జరడ కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. ఆదివారం తమ సిబ్బందితో చేసిన దాడుల్లో పేకాట ఆడుతున్నట్లు ఇద్దరిని గుర్తించి పట్టుకున్నామని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేశామని చెప్పారు. నిందితుల వద్ద నుంచి రూ.36,500 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మానవత్వం చాటిన ఎస్ఐ



శివను ఏరియా ఆసుపత్రిలో చేర్పిస్తున్న ఎస్ఐ

పాలకొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన బైకుపై ఆస్పత్రికి తరలించి ఎస్ఐ ప్రయోగమూర్తి మానవత్వం చాటుకున్నారు. వీరఘట్టం-పాలకొండ రోడ్డు సమీపంలో ఆదివారం బైకుపై వెళ్తూ గుంతలో పడిపోయిన గెడ్డకుమ్మర వీధికి చెందిన డి.శివను ఎస్ఐ ప్రయోగమూర్తి చూశారు. వెంటనే తన వాహనం ద్వారా పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శివ కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. ఎస్ఐ సూచన మేరకు వైద్యులు వైద్యం అందించారు. దీంతో శివ కుటుంబ సభ్యులు ఎస్ఐకి, పోలీసు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

గ్రామాల్లో అన్న సమారాధనలు

గరుగుబిల్లి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పెద్దూరు గ్రామంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. బీసీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ● **పాలకొండ:** తుమరాడ గ్రామంలోని నెల్లివీధిలో వినాయక నవరాత్రులు సందర్భంగా ఆదివారం 1,500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ యువకులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ● **సీతంపేట రూరల్:** సీతంపేటలోని ఎస్టీ కాలనీలో గణేశ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.



గరుగుబిల్లి: అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



పాలకొండలో..



సీతంపేట రూరల్: ఎస్టీ కాలనీలో..

ఏచూరి మృతి తీరని లోటు





సీతంపేట రూరల్, పాలకొండ: నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సీతంపేట రూరల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కష్టజీవులకు, ప్రజా సంఘాలకు తీరని లోటు అని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు అన్నారు. ఆదివారం డొంబంగివలస గ్రామంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ సభ్యులు రియ్యన్న, ఎం.రైకన్న, కె.జగదీశ్వరరావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. ● **పాలకొండ:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలుపుతూ మల్లమ్మగూడలో ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఎం నేత దావాల రమణారావు, ఎస్.మజ్జియా సీతారాం.. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దూసి దుర్గారావు, కాద రాము, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు పనులు

● అవస్థలు పడుతున్న ప్రయాణికులు

వీరఘట్టం: వీరఘట్టం-పాలకొండ ప్రధాన రహదారి చిదిమి జంక్షన్ నుంచి చదిమి పాలమెట్ట కలిపే రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 2023 అక్టోబరు 12న అప్పటి వైసీపీ ప్రభుత్వం హడావుడిగా శంకుస్థాపన చేసింది. పనులు మాత్రం నత్తనడకన సాగాయి. నేటికీ రహదారి పనులు పూర్తి కాలేదు. దీంతో రాళ్లు తేలిన రహదారిపై వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణం